## బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలు



సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం, మే 30 : రాష్ట్ర ఆవతరణ దినోత్సవం సందర్భంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా నాయకుడు కర్నె అరవింద్, మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను ఎంతో వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించే ఉత్సవాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా పాల్గొని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఏనుగు బుచ్చిరెడ్డి, గరిగె శేఖర్‌గౌడ్, బర్తాకి రాజు పాల్గొన్నారు.

## వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



కుమ్మరిగూడలో జీవాలకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

షాబాద్, మే 30: జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారిణి డాక్టర్ స్రవంతి అన్నారు. గురువారం మండలంలోని కుమ్మరిగూడ, లింగారెడ్డిగూడ గ్రామాల్లో గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీవాల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది బలరాం, కృష్ణయ్య, రాణి రైతులు తదితరులున్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

కడ్తాల్, మే 30: గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు ఎంపీటీసీల ఫోరం జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గుర్లకుంటలోని బోర్లను గ్రామ పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి అధిక మొత్తంలో తాగునీటి సరఫరా అయ్యే గుర్లకుంట చెరువులోని బోర్లను పరిశీలించామని తెలిపారు. వచ్చే వాన కాలంలో కుంటల్లో ఉన్న బోర్లను రిపేరు చేసేందుకు వీలుగా, కుంటలోకి దారిని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సిబ్బంది బ్రహ్మచారి, చెన్నయ్య, నాయకులు రాజేశ్, శ్రీకాంత్, భానుకిరణ్ పాల్గొన్నారు.

## ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



యాచారం, మే 30 : మండలంలోని మాల్ మార్కెట్‌లో సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం కార్మిక, కర్షకులు ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పక్కాగా అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు అన్ని రకాల వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులకు కనీస వేతనంతో పాటుగా పూర్తి స్థాయిలో భద్రత కల్పించాలని కోరారు. లేబర్ కమిషనర్ క్షేత్ర స్థాయిలో పర్యటించి కార్మికులెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్మికుల పట్ల ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో చందునాయక్, సత్యనారాయణ, రాములు, లింగమ్మ, నర్సమ్మ, సుగుణ తదితరులున్నారు.



ఆమనగల్లులో రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారిణి అరుణకుమారి



మంచాల : ఆరుట్లలో విత్తనాల కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో జ్యోతిశ్రీ

# రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

- లూజు సంచుల్లోని విత్తనాలు కొనవద్దు
- మండల వ్యవసాయ శాఖ అధికారులు
- జిల్లాలో కొనసాగుతున్న సదస్సులు



కొత్తూరు : విత్తన కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రాజారత్నం, ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

చేవెళ్ల రూరల్, మే 30 : రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు వహించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. గురువారం చేవెళ్ల మండల పరిధిలోని రేఘుడిగణాపూర్, ఆలూర్ గ్రామాల్లో నకిలీ విత్తనాలు, విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రైతులు లూజుగా ఉన్న సంచుల్లో విత్తనాలు కొనుగోలు చేయరాదని, విత్తనాలు కొనుగోలు చేసిన షాపు నుంచి రసీదు తీసుకొని, విత్తన ప్యాకెట్, బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. కార్యక్రమాల్లో మండల వ్యవసాయ విస్తరణాధికారులు రాజేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణ, మాజీ సర్పంచ్ రాయికంటి నర్సింహులు పాల్గొన్నారు.

**అధికారుల సూచనలు పాటించాలి**

ఇబ్రహీంపట్నంరూరల్ : పంటల సాగుకోసం కొనుగోలు చేసే విత్తనాల విషయంలో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఇబ్రహీంపట్నం వ్యవసాయ విస్తరణాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని రాయపోల్ గ్రామంలో రైతులకు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులు సొంత నిర్ణయాలు తీసుకోకుండా ఎలాంటి ఇబ్బందులున్నా వెంటనే అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎక్కడైనా కల్తీ విత్తనాల విషయం బయటకొస్తే చర్యలు తప్పవని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాయపోల్ మాజీ సర్పంచ్ బల్వంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

**విడిగా లభించే విత్తనాలను కొనవద్దు**

కడ్తాల్ : రైతులు విడిగా సంచుల్లో లభించే విత్తనాలను కొనుగోలు చేయవద్దని మండల వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు రమణ, వందన, అభినవ్, కేదార్‌సింగ్ అన్నారు. వానకాలం పంటల సాగుపై మండల పరిధిలోని రావిచేడ్, అన్మాస్‌పల్లి, ముద్విన్, సాలార్‌పూర్ గ్రామాల్లోని రైతులకు అధికారులు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పంటల సాగులో అధికారుల సూచనలు, సలహాలను పాటించాలని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు, రసీదులు పొంది, వాటిని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు.



కడ్తాల్ : రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ శాఖ విస్తరణాధికారి వందన

కార్యక్రమంలో ఎంపీటీసీలు గోపాల్, ప్రియ, ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

**విత్తనాల షాపుల తనిఖీ...**

మండలంలోని పలు విత్తనాల షాపులను గురువారం మండల వ్యవసాయ శాఖ అధికారిణి శ్రీలత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లోని రికార్డులు, విత్తనాల, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు విధిగా రసీదులు అందజేయాలని, షాపుల ఎదుట ధరల పట్టికకు సంబంధించిన బోర్డులను ఉంచాలని సూచించారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు**

ఆమనగల్లు : అధీకృత ఫర్టిలైజర్ డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దుతో పాటు కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారిణి అరుణకుమారి డీలర్లను హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని పలు అధీకృత డీలర్ దుకాణాలను ఏవో అరుణకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, విత్తన, మందుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఏవో అరుణకుమారి మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆమె అన్నారు. దుకాణాల ఎదుట స్టాక్ వివరాలు, ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని షాప్ నిర్వాహకులకు ఏవో సూచించారు. అంతకుముందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని సింగంపల్లి, ఆకుతోటపల్లి, ఆమనగల్లు మున్సిపాలిటీ, సంకటోనిపల్లి గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవోలు, రైతులతో సమావేశమై సాగులో అవలంబించాల్సిన పద్ధతులు, సూచనలు, సలహాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కమతం రాధమ్మ, ఏఈవోలు రాణి, సాయిరాం, శివతేజ, రైతులు పాల్గొన్నారు.

**విత్తన ప్యాకెట్లను భద్రంగా ఉంచుకోవాలి**

కొత్తూరు : విత్తనాలు విత్తిన తర్వాత ప్యాకెట్లను భద్రంగా ఉంచుకోవాలని షాద్‌నగర్ ఏడీఏ రాజరత్నం రైతులకు సూచించారు. కొత్తూరు మండలంలోని గూడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని రాగ్యా తండాలో రైతులకు విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీఏ రాజారత్నం, ఎంపీపీ మధుసూదర్‌రెడ్డి హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. అవగాహన సదుస్సులో ఏఈవో నిఖిత, రైతులు పాల్గొన్నారు.

**విత్తనాల కొనుగోళ్లలో అవగాహన తప్పనిసరి**

మంచాల : విత్తనాల కొనుగోళ్లలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారిణి జ్యోతిశ్రీ అన్నారు. గురువారం మంచాల మండలం ఆరుట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో కృషి విజ్ఞాన కేంద్రం రంగారెడ్డి, మంచాల వ్యవసాయ శాఖ వారి సహకారంతో పత్తి విత్తన సంస్థలు రాశీ సీడ్స్, సీడ్‌వర్క్ వారి ఆధ్వర్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. పత్తి సాగులో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పత్తిలో రాశీసీడ్స్ ఆర్‌సీహెచ్-971, ఆర్‌సీహెచ్ 929 సీడ్స్ అనుకూలమైన విత్తన రకమని రైతులు అవసరమున్న వారు ఈ విత్తనాలను కొనుగోలు చేయాలని కోరారు. తప్పనిసరిగా రైతులు భూసార పరీక్షలు చేయించుకున్న తర్వాతనే పంటలను సాగు చేసుకోవాలని అన్నారు. సమావేశంలో ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారులు విజయ్‌కుమార్, లింగస్వామి, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



చేవెళ్లరూరల్ : రేఘుడిగణాపూర్ గ్రామంలో అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ విస్తరణ అధికారి బాలకృష్ణ



ఇబ్రహీంపట్నం రూరల్ : రాయపోల్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో శ్రవణ్‌కుమార్

## ఎమ్మెల్యే పరామర్శ

కడ్తాల్, (తలకొండపల్లి) మే 30 : తలకొండపల్లి మండల కేంద్రం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో, కర్కాస్ తండాకి చెందిన సభావట్ కృష్ణనాయక్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక నాయకులతో కలిసి, గురువారం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానలో కృష్ణనాయక్ మృతదేహాన్ని సందర్శించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో చనిపోయిన మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని తెలిపారు. ఆయన వెంట నాగర్‌కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, నాయకులు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెద్దఅంబర్‌పేట, మే 30: విద్యుత్ స్తంభాలపై పడుతున్న చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కే చంద్రమౌళి తెలిపారు. పెద్దఅంబర్‌పేట టౌన్, శివగంగా కాలనీ, భువనేశ్వరినగర్, స్వగృహ వెంచర్, అంబికానగర్, పోలీస్ కాలనీ, హనుమాన్‌నగర్, వినాయకనగర్, మైత్రి సిరిపురం కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంటు సరఫరా ఉండదు. సాయి కాలనీ, లక్ష్మీ కుటీర్, శిల్పికాలనీ, బ్యాంక్ కాలనీ, యాదాద్రినగర్, శాంతినగర్, బలిజగూడ రోడ్డు పరిసర ప్రాంతాలు సదాశివ, తార గృహాలు, హరిహరహారం కాలనీ, కొహెడ రోడ్డు పరిసర ప్రాంతాలు, రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

**తుర్కయాంజాల్ పరిధిలో..**

తుర్కయాంజాల్ : తుర్కయాంజాల్ సబ్‌స్టేషన్ పరిధి రంగనాయకుల గుట్ట ఫీడర్ పరిధిలోని మైత్రీవనం, బ్రహ్మణపల్లి, బ్రహ్మణపల్లి ఏజీఎల్, కొహెడ, తొర్రూర్‌లో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సాధారణ మరమ్మతులు, చెట్ల నరికివేతలో భాగంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఇంజాపూర్ విద్యుత్ శాఖ ఏఈ రాములు తెలిపారు.

**ఆదిబట్ల పరిధిలో..**

ఆదిబట్ల, మే30: నేడు ఆదిబట్ల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆదిబట్ల విద్యుత్ ఏఈ జయన్న గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఆదిబట్ల సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ అగ్రికల్చర్ ఫీడర్ లైన్లకు తాకే చెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు తెలిపారు. ఆదిబట్లలోని వ్యవసాయ బోరుబావులు, మమ్మరాజుగూడెం వ్యవసాయ బోరుబావులకు, ఎలిమినేడు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్, పోచారంలోని ఇండస్ట్రీస్‌కు విద్యుత్ సరఫరాల్లో అంతరాయం కలుగుతుందని, దీనికి రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

## విద్యార్థులకు సన్మానం

చేవెళ్లటౌన్, మే 30: రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధ్యక్షతన 2024 విద్యా సంవత్సరంలో 10/10కి జీపీఏ సాధించిన విద్యార్థులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. చేవెళ్ల మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో పదో తరగతిలో చదివిన విద్యార్థినులు సాయి మనోజ్ఞ, జోత్స్న 10/10 జీపీఏ సాధించినందుకు విద్యార్థులను ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ శశాంక రంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో సన్మానించారు.

**నందిగామ** : నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించిన గ్రామానికి చెందిన మాస్టర్ సుమిత్‌కు గురువారం రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శశాంక ప్రతిభా పురస్కారం అందజేశారు.

**ప్రధానోపాధ్యాయులకు సన్మానం**

కడ్తాల్ : మండలంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించిన ఐదు పాఠశాలల హెచ్‌ఎంలకు కలెక్టర్ కార్యాలయంలో సన్మానం చేశారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కడ్తాల్ మండలంలో పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన... ముద్విన్, చరికొండ, ఏక్వాయిపల్లి, మైసిగండి, కడ్తాల్ కేజీబీవీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. ఆయా పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు శ్రీనివాసులు, నిర్మల, తిరుపతయ్య, అనిత, బాలరాజుతోపాటు ఎంఈవో సర్దార్‌నాయక్, మండల నోడల్ అధికారి జంగయ్యకు కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి జ్ఞాపికలను అందజేసి సన్మానించారు.

## భూ కబ్జా .. కేసు నమోదు

నందిగామ, మే 30 : రంగాపూర్ గ్రామ పంచాయతీ చలివేంద్రగూడ గ్రామ శివారులోని 499 సర్వే నంబర్‌లోని ఈనాం భూమిని తప్పుడు రిజిస్ట్రేషన్‌తో 10 గుంటల భూమిని అదే గ్రామానికి చెందిన అనిత కబ్జా చేయడంతో ఆర్ఐ రోజా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



ఆలయ ముఖద్వారానికి భూమి పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, మే 30: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని ముద్విన్-ఏక్వాయిపల్లి గ్రామాల శివారులో మల్లన్నగుట్టపై కొలువుదీరిన మల్లికార్జునస్వామి ఆలయానికి సంబంధించిన ముఖద్వారం నిర్మాణానికి గురువారం కర్కల్‌పహాడ్ గ్రామం వద్ద స్థానిక నాయకులతో కలిసి ఆయన భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త ఎట్టయ్యయాదవ్‌ను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్లు వీరయ్య, వెంకటయ్యయాదవ్, నాయకులు శ్రీను, వినోద్, ముత్యాలు పాల్గొన్నారు.

## మెగా మెడికల్ క్యాంపునకు విశేష స్పందన



మెడికల్ క్యాంపులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 30 : అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో సురక్ష సేవా సంఘం, ఆశ్రయం అండ్ ఆఫ్ హోప్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మెగా మెడికల్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. ఈ క్యాంపులో రక్తపోటు, షుగర్, థైరాయిడ్, కిడ్నీ, లివర్, గుండె, దంత, కంటి పరీక్షలు, ఈసీజీ, ఎక్స్‌రేతో పాటు 24 రకాల రక్త పరీక్షలు చేసి ఉచితంగా కండ్ల అద్దాలు, మందులు పంపిణీ చేశారు. 516 మంది సద్వినియోగం చేసుకున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపీ శంకర్‌యాదవ్, సంఘం క్రియాశీల సభ్యులు పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మృతి

నందిగామ, మే 30 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన వీర్లపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని వీర్లపల్లి గ్రామానికి చెందిన గణపురం కుమార్(35) మద్యానికి బానిసై ఇంట్లో తరచూ గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 23న మద్యం మత్తులో శరీరానికి నిప్పు అంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య రేవతి ఇచ్చిన ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విద్యుత్ వైర్ల చోరీ

ఆదిబట్ల, మే 30: నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఇంట్లోకి దొంగలు చొరబడి ఇంట్లో ఉన్న కరెంట్ వైర్లను కట్ చేసి ఎత్తుకెళ్లిన ఘటన ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. కొంగరకలాన్ గ్రామానికి చెందిన ఉడుగుల భాస్కర్ గ్రామంలోని చౌరస్తాలో నూతనంగా ఇంటిని నిర్మిస్తున్నాడు. ఇంట్లో కరెంట్ వైర్లు ఏర్పాటు చేయగా, బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి కరెంట్ వైర్లను ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఇంట్లోకి వెళ్లి చూసిన బాధితుడు కరెంట్ వైర్లు ఎత్తుకెళ్లారన్న విషయం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## నాటుసారా విక్రయిస్తే చర్యలు

కడ్తాల్, మే 30: నాటుసారా తయారుచేసినా, అమ్మినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ హెచ్చరించారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల్ మండలాల్లో, గతంలో నాటుసారా తయారీ కేసుల్లో అరెస్ట్ అయిన వారిని బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. గురువారం కడ్తాల్ తహసీల్దార్ ఎదుట దేపావత్ రమేశ్, రమావత్ రమేశ్, కేతావత్ బక్కా, కేతావత్ మోతి, ఇస్లావత్ వాల్యా, సిల్వేరి చెన్నయ్య, సభావట్ చంద్రానాయక్‌ను బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నాటుసారా కేసుల్లో బైండోవర్ అయినవారు ఏడాదిలోపు తిరిగి వారిపై కేసు నమోదైతే రూ.లక్ష జరిమానా లేదా సంవత్సరం జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. కిరాణం దుకాణదారులు నల్లబెల్లం, పటిక, ఆర్ఎస్ ముద్దలు విక్రయించినా, పాన్ షాపుల్లో గంజాయి సిగరెట్లు, చాక్లెట్లు, మత్తు కలిగించే ఎలాంటి వస్తువు అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఫంక్షన్ హాల్స్, ఫాంహౌస్‌ల్లో ఈవెంట్ పర్మిట్ లేకుండా మద్యానికి అనుమతిస్తే నిర్వాహకులపై ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



షాద్‌నగర్‌టౌన్ : రాష్ట్ర సదస్సు కరపత్రాలను విడుదల చేస్తున్న శ్రీనూనాయక్, కూలీలు

షాద్‌నగర్‌టౌన్, మే 30 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రక్షణ కోసం వచ్చే నెల 10న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా ఇన్‌చార్జి శ్రీనూనాయక్ పిలుపునిచ్చారు. ఫరూఖ్‌నగర్ మండలం కాశిరెడ్డిగూడ గ్రామంలో గురువారం వ్యవసాయ కూలీలతో కలిసి రాష్ట్ర సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తున్నదని, ఉపాధి హామీని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర సదస్సుకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు శివదాసన్, మంత్రి సీతక్క, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య, కార్యదర్శి వెంకట్‌రాములు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ కూలీలు రాజు, అంజయ్య, వీరయ్య, మంజుల, సువర్ణ, యాదమ్మ, పార్వతమ్మ, అలివేలు, మంగమ్మ, పద్మమ్మ, బుచ్చమ్మ, మాధవి, చెన్నమ్మ, చంద్రమ్మ, దీప, రత్నమ్మ, అంజయ్య పాల్గొన్నారు.

**వ్యవసాయ కార్మిక సంఘం కరపత్రం విడుదల**

మంచాల : గ్రామీణ ఉపాధిహామీ చట్టం అమలు-సవాళ్లు అనే అంశంపై జూన్ 10న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కార్యదర్శి ఎ.అశోక్ అన్నారు. గురువారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సదస్సు కరపత్రాన్ని కూలీలతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఉపాధిహామీ పథకం నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో ఉపాధి కూలీలకు ప్రతి వారం ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు. ఉపాధి కూలీల సమస్యలపై నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కూలీలను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.



మంచాల : ఆరుట్లలో రాష్ట్ర సదస్సు కరపత్రం విడుదల చేస్తున్న ఉపాధి కూలీలు